'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వాల్మీకి కుంభకోణం

కర్ణాటక వాల్మీకి కుంభకోణంలో సోమవారం ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌తో కాంగ్రెస్ అవినీతి బండారం బద్దలైంది. గిరిజన బిడ్డల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు దారి మళ్లించారనేది ఆరోపణ. అలా మళ్లించిన నిధులను కర్ణాటకలోని బళ్లారితో పాటుగా తెలంగాణ, ఏపీ ఎన్నికల ఖర్చులకు, విశేషించి భారీగా మద్యం కొనుగోలుకు వినియోగించారని అభియోగపత్రంలో పేర్కొనడం గమనార్హం. మిగతా స్కామ్‌ల తరహాలో ఇందులో పెద్ద వ్యూహాలేమీ లేవు. ఓ ప్రభుత్వ సంస్థ నిధులను ముందుగా ఆమోదయోగ్యత లేని ఓ ఖాతాలోకి మళ్లించి, అటునుంచి తెలంగాణ, ఏపీలోని 18 వేర్వేరు నకిలీ ఖాతాల్లో జమ చేశారు. అలా చేజిక్కించుకున్న రూ.89.62 కోట్ల సొమ్మును వివిధ ఎన్నికల్లో ఖర్చుచేశారు. రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పొరుగు రాష్ట్రం నుంచి వచ్చే వాహనాల్లో పెద్ద ఎత్తున డబ్బు పట్టుబడటం తెలిసిందే. కాంగ్రెస్ పెద్దలు కర్ణాటకను ఏటీఎంలా వాడుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అక్షరాలా నిజమని ఈడీ చార్జిషీట్ రుజువు చేసింది.

మాజీ మంత్రి నాగేంద్రను ప్రధాన నిందితుడిగా చేర్చినప్పటికీ పైస్థానాల్లో ఉన్న పెద్దలకూ ఈ కుంభకోణంలో హస్తమున్నట్టు వినవస్తున్నది. మొత్తం 24 మంది నిందితుల పేర్లు చేర్చారు. అందులో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. అటు నుంచి ఇటు ధన ప్రవాహానికి వారు సంధానకర్తలుగా వ్యవహరించారని ఈడీ అంటున్నది. ప్రైవేటు ఖాతాకు ప్రభుత్వ నిధుల మళ్లింపునకు సంబంధించిన నియమాలను, మార్గదర్శకాలను ఆర్థికశాఖ, గిరిజన సంక్షేమశాఖ ఉల్లంఘించాయని ఈడీ ఆరోపించింది. గిరిజన సంక్షేమశాఖ మంత్రిని ఈసరికే అరెస్ట్ చేశారు. కాగా ఆర్థికశాఖను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా నిర్వహిస్తున్నారు. ఈడీ దాఖలు చేసింది ముందస్తు అభియోగపత్రం మాత్రమే. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ అనుబంధ అభియోగాలు దాఖలు చేస్తామంటున్నది. అదే జరిగితే ఏయే అధికార పీఠాలకు ఈ కేసు చుట్టుకుంటుందో ఇప్పుడే చెప్పలేం.

అవినీతి కేసులు వెంటాడటంతోనే ఢిల్లీ గద్దెను కోల్పోయి, మూలన పడి మూలుగుతున్నా కురువృద్ధ పార్టీ తీరు మారలేదని తాజా పరిణామం సూచిస్తున్నది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేకతను వాహనంగా చేసుకుని, అలవిమాలిన హామీలను ఇంధనంగా వాడుకొని అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలు గత్యంతరం లేక ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే కాంగ్రెస్ ఎందుకవుతుంది? స్కాముల పార్టీ అనే ముద్రను సార్థకం చేసుకోవాలి కదా? బోఫోర్స్, బొగ్గు, టూజీ ఇలా కుంభకోణాల పరంపర ఆగిపోతే ఎలా? అదిగో ఆ వారసత్వంలో భాగమే వాల్మీకి కుంభకోణం. అయితే ఈ కుంభకోణం బయటపడటంతో మనం మాట్లాడుకుంటున్నాం. బయటపడనివి ఇంకెన్ని ఉన్నాయో తెలియదు. ఎందుకంటే ఇక్కడ చేతులు మారింది ఇప్పటి వ్యయాలతో పోలిస్తే చిన్న మొత్తమే. ఇంకెన్ని వనరుల్లో చేయి పెట్టారో, ఇక్కడి పెద్ద తలకాయలు ఏవో మరింత లోతుగా తరచి చూస్తే కానీ బయటపడదు.

ఎమ్మెల్యేపై దాడి.. ఎక్కడి విష సంస్కృతి?

ఇది మాయిముంత దేవులాడుకోవాల్సిన సమయం. తెలంగాణ జెండా కప్పుకొని, తెలంగాణ బిడ్డల ఓట్లతో గెలిచినవాళ్లు తెలంగాణ వ్యతిరేకులతో చేతులు కలిపి తల్లి రొమ్ము గుద్దుతున్న నేపథ్యంలో తెలంగాణ జనం మల్లోసారి కన్నతల్లిని కాపాడుకోవాల్సిన సమయం వచ్చింది. చాటుమాటుగా కాదు, నిర్భీతిగా, పట్టపగలు శాసనసభ్యుని ఇంటికివెళ్లి దాడి చేయటం, ఈ దాడికి స్వయానా పోలీసు యంత్రాంగమే కాపు గాయటం చూస్తుంటే.. ముమ్మాటికీ ఇది అధికార పీఠం అండదండలతోనే జరిగిన దాడి అనిపిస్తున్నది. సంఘ విద్రోహ శక్తులు ఇంట్లోకి చొరబడి శాసనసభ్యుని మీద పడి చేతికి అందిన వస్తువులతో కొడుతుంటే పోలీసులు కొయ్యబొమ్మల తీరున చేష్టలుడిగి నిలబడిపోయారు.

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

హైదరాబాద్ నగరం నడిగడ్డలోనే నెంబర్ వన్ బిజినెస్ రాస్తా మీద దాదాపు 25-30 వాహనాల కాన్వాయ్ మూడు పోలీసుస్టేషన్లు దాటి శాసనసభ్యుని ఇంటిమీద పడి దాడికి తెగబడ్డది అంటే.. పోలీస్ ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ, స్థానిక పోలీసులు కండ్లు మూసుకున్నారు అనుకోవాల్నా! తెలంగాణ బిడ్డలకు హైదరాబాద్‌లో రక్షణ లేదని చాటిచెప్పటానికి రాజ్యం ఉసిగొల్పిన దాడిగానే పరిగణించాలి.

ఇద్దరు శాసనసభ్యుల మధ్య మూడు రోజులుగా సవాళ్లు- ప్రతిసవాళ్లు నడుస్తున్నయి. ఇటువంటి పరిస్థితుల్లో ఒక శాసనసభ్యుడిని గృహనిర్బంధంలో ఉంచి, ఇంకో శాసనసభ్యుడిని రోడ్డు మీద వదిలేస్తారా? ఇదేనా పోలీసింగ్ ప్రణాళిక? దాడిని అంచనా వేసి అడ్డుకోలేనంత అసమర్థ స్థితిలో ఉన్నదా మన నగర పోలీసు వ్యవస్థ? ఈ లెక్కన ప్రతిపక్షాలకు చెందినవారి ఇండ్లల్లో అక్రమంగా ప్రవేశించి హత్యలు చేసినా, లూటీలు చేసినా ఫరవాలేదన్న మాట. పోలీసులే దుండగులకు రక్షణ వలయం కూడా కల్పిస్తారా?

అరికెపూడి గాంధీని నామినేట్ చేసింది పబ్లిక్ న్యూసెన్స్ కమిటీ చైర్మన్‌గా కాదు, రాజ్యాంగబద్ధమైన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా. పద్దుల ఆడిట్ బాధ్యత ప్రతిపక్షాలది. ఈ పదవి ప్రతిపక్షాల హక్కు. ఫిరాయింపుదారుడు ఎప్పటికీ దీనికి అర్హుడు కాదు. అది అరికెపూడికి కూడా తెలుసు.

పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్ష నేతకు చెందుతుంది. అది రాజ్యాంగధర్మం. దేశంలోనే ఈ సంప్రదాయం ఉన్నది. తెలంగాణలో కొత్త రాజ్యాంగమేదో అమల్లోకి వచ్చినట్టు పార్టీ ఫిరాయించి, పాలకపక్షం పంచన చేరిన అరికెపూడి గాంధిని పీఏసీ చైర్మన్‌గా నియమించటం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం. ఇదే తరహాలో గతంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అక్కడి తృణమూల్ కాంగ్రెస్ సీఎం మమతా బెనర్జీ చేశారు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమత విజయం సాధించారు. అదే ఏడాది నాడియా జిల్లా కృష్ణానగర్ ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ టిక్కెట్‌పై గెలిచిన ముకుల్ రాయ్ అధికార తృణమూల్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. మమతా బెనర్జీ ఆయనను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. దీన్ని అక్కడి ప్రతిపక్ష పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. సంప్రదాయానికి విరుద్ధంగా పీఏసీ పదవిని ఫిరాయింపుదారునికి ఇచ్చారని ప్రతిపక్ష సభ్యుడు కలకత్తా హైకోర్టులో పిల్ వేశారు. అనంతరం ముకుల్‌రాయ్ అనివార్యంగా రాజీనామా చేయాల్సి వచ్చింది.

అరికెపూడి గాంధీని నామినేట్ చేసింది పబ్లిక్ న్యూసెన్స్ కమిటీ చైర్మన్‌గా కాదు, రాజ్యాంగబద్ధమైన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా. పద్దుల ఆడిట్ బాధ్యత ప్రతిపక్షాలది. ఈ పదవి ప్రతిపక్షాల హక్కు. ఫిరాయింపుదారుడు ఎప్పటికీ దీనికి అర్హుడు కాదు. అది అరికెపూడికి కూడా తెలుసు. అందుకే నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని, అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఓ ప్రకటన చేశారు. ఇది మోసపూరిత ప్రకటన అని తెలంగాణ సమాజానికి తెలుసు. ప్రజలు అమాయకులేం కాదు. ఈ నేపథ్యంలో సాటి శాసనసభ్యునిగా కౌశిక్‌రెడ్డి స్పందించారు.

అరికెపూడి గాంధీ తన ఇంటికి వస్తే బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి, గౌరవంగా భోజనం పెట్టి, అక్కడి నుంచి అటే కేసీఆర్ దగ్గరికి తీసుకువెళ్తానని చెప్పారు. ఆయన వస్తున్నాడని తెలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేను నిలవరించకుండా, ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా తన ఇంటికి పంపాలని తన గేటెడ్ కమ్యూనిటీ సెక్యూరిటీకి ఆదేశాలిచ్చారు. ఇది తప్పు కాదు కదా? అనుచరులతో వెళ్లిన గాంధీ పరుష పదజాలం, రెచ్చగొట్టే మాటలతో కౌశిక్‌రెడ్డి ఇంటి మీద పడ్డాడు. కౌశిక్‌రెడ్డికి దమ్ముంటే బయటకు రావాలని, తాను ఇక్కడే ఉన్నానంటూ గాంధీ సవాల్ విసిరారు. ఆయన సవాళ్లతో అనుచరులు రెచ్చిపోయారు. చేతికందిన వస్తువులతో దాడి చేశారు. ఈ దాడి హైదరాబాద్ సంస్కృతికి విరుద్ధం. పదేండ్ల తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ప్రాంతీయ పోరాటాలు, అస్తిత్వ పోరాటాలతో రాజ్యం సాధించుకున్న దేశాల్లో జరిగిన తదనంతర పరిణామాలపై కేసీఆర్ విస్తృతంగా అధ్యయనం చేశారు. నివేదికలు, పుస్తకాలు చదివారు. చర్చలు, ఇష్టాగోష్టి పెట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రుల ఆస్తులపై, ఆంధ్రులపై భౌతికదాడులు జరిగే ప్రమాదం ఉన్నదని, వారి ఆస్తులు లూటీ అయ్యే అవకాశం ఉన్నదని ముందే పసిగట్టారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేశారు.

అంతకుముందు ఉన్న పాతకాలపు వాహనాలను తొలగించి, పోలీసులకు అధునాతనమైన ఇన్నోవా వాహనాలను సమకూర్చారు. తరతమ భేదం లేకుండా, హద్దులు మీరిన విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపారు. కేసీఆర్ విశాల హృదయం ముందుచూపుతో హైదరాబాద్‌లో ఆంధ్ర ప్రజలు గుండె మీద చెయ్యి వేసుకుని కంటి నిండా నిద్రపోయారు. కానీ, ఇవాళ హైదరాబాద్ సంస్కృతి మీద దాడి జరిగింది. హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టించి, కల్లోలిత తెలంగాణగా ప్రపంచం ముందు నిలబెట్టి, మళ్లీ ఆంధ్రలో కలపాలనే కుట్రకు ఇది తొలి అడుగుగా తెలంగాణవాదులు, పౌర సమాజం భావించాల్సి ఉంటుంది.

నివాళి

పోరాటమే తన ఊపిరి!

ఈ సమాజం నాకేమిస్తుందని వెయ్యి కళ్లతో ఎదురుచూసేవారెందరో ఉన్న ఈ సమాజంలోనే.. సమాజం కోసం తమ సర్వస్వాన్ని ధారబోయగల త్యాగమూర్తులు కూడా ఉన్నారని కొందరు త్యాగధనులు నిరూపిస్తారు. వారి సిద్ధాంతాలు ఏమైనా కావచ్చు, వాళ్లు నడిచే బాట ఎంత కఠినతరమైనదైనా కావచ్చు. కానీ, తాము నమ్మిన సిద్ధాంతం కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు కొందరు. అలాంటి దార్శనికుల్లో ఒకరు సీతారాం ఏచూరి.

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

ఉన్నత కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యాభ్యాసం చేసి, మంచి ఉద్యోగంలో స్థిరపడగలిగే అన్ని అవకాశాలున్నా తన జీవితాన్ని సమాజం కోసం ధారపోశారు ఏచూరి. సర్వేశ్వర సోమయాజులు, కల్పకం దంపతులకు 1952 ఆగస్టు 12న మద్రాస్‌లో సీతారాం ఏచూరి జన్మించారు. సోమయాజులు అప్పటి ఏపీఎస్ఆర్టీసీలో ఇంజినీరుగా పని చేస్తున్నందువల్ల హైదరాబాద్‌లోని ఆల్‌సెయింట్ హైస్కూల్‌లో సీతారాం ఏచూరి చదివారు. తర్వాత న్యూఢిల్లీలోని ప్రెసిడెంట్ ఎస్టేట్ స్కూల్ నుంచి సెకండరీ ఎడ్యుకేషన్‌లో దేశంలోని ప్రథమ స్థానాన్ని సాధించారు. సెయింట్ స్టీఫెన్ కళాశాల నుంచి బీఏ, జేఎన్‌టీయూ నుంచి ఎంఏ పట్టా పొందారు. ఇక జేఎన్‌యూలో పీహెచ్‌డీలో చేరినా ఎమర్జెన్సీ కారణంగా అరెస్టు కావడంతో అది అర్ధాంతరంగా ముగిసింది.

జేఎన్‌యూ విద్యార్థి నేతగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఏచూరి అంచెలంచెలుగా ఎదిగారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఏచూరి ఆ తర్వాత దేశం గర్వించే నేతయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన 1975లో కొంత కాలం పాటు జైలుజీవితం గడిపారు. జైలు నుంచి విడుదలయ్యాక మూడు పర్యాయాలు జేఎన్‌యూ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల హక్కుల కోసం పోరాడారు. 1978లో ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా జాయింట్ సెక్రెటరీగా, ఆ తర్వాత ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనతికాలంలోనే సీపీఐ (ఎం)లో చేరి, ఆ పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకరిగా గుర్తింపు సాధించారు. 1984లో ఆ పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. సీపీఐ (ఎం) జనరల్ సెక్రెటరీగానూ సేవలందించారు. 2005లో పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఏచూరి దేశ సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఏచూరి ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదు. తన జీవితాన్ని సర్వస్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ధారపోశారు.

ఏచూరి విద్యావంతుడు, గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా, ఒక ఉత్తమ రచయిత కూడా. ఆయన అనేక పుస్తకాలను రచించారు. వాటిలో చాలావరకు పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి ఏచూరి సీతారాం పరమపదించడంతో ఈ దేశం ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది.

భూతాపానికి సామాన్యుడే బలి!

గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ 2021 ప్రకారం గ్లోబల్ వార్మింగ్ కారణంగా ప్రభావితమయ్యే మొదటి 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. 2100 నాటికి భారత్ తన జీడీపీలో 3-10 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, వాతావరణ మార్పుల కారణంగా 2040 నాటికి భారత పేదరిక సూచీ 3.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు 'ది కాస్ట్స్ ఆఫ్ క్లైమేట్ ఛేంజ్ ఇన్ ఇండియా' పేరిట వాతావరణ సంబంధిత నష్టాలు, అసమానత, పేదరికం పెరిగే అవకాశం తదితర అంశాలపై లండన్‌కు చెందిన ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ చేసిన అధ్యయన నివేదికను 2021 జూన్‌లో వెలువరించింది. అయితే ఈ విపత్కర పరిస్థితులకు కారణం సంపన్న కుటుంబాలే కావడం గమనార్హం.

చెన్నమనేని రమేశ్



ఓ సెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమనిటీ అండ్ నేచర్ అధ్యయనం ప్రకారం.. మన దేశంలో పేద కుటుంబాలతో పోలిస్తే 20 శాతం సంపన్న కుటుంబాలు, ఏడు రెట్లు అధిక కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. రోజుకు 1.9 డాలర్ల కంటే తక్కువ ఖర్చు చేసే కుటుంబాలను ఇందుకు ఎంచుకున్నారు. మన దేశంలోని ప్రతి వ్యక్తి ఏడాదికి విడుదల చేసే సగటు కార్బన్ ఉద్గారాలు 0.56 టన్నులు. ఇందులో పేద ప్రజల తలసరి 0.19 టన్ను కాగా.. సంపన్నుల్లో 1.32 టన్నులుగా ఉంది. 2013లో నిర్వహించిన నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్‌వో) నుంచి ఇండియా స్పెండ్ సేకరించిన డాటా ప్రకారం.. ఆహారం, విద్యుత్తు వాడకం ఇందుకు ప్రధాన కారకాలు. సామాజిక, ఆర్థిక సమూహాల్లో ఎక్కువ ఉద్గారాలకు ఇవే కారణం. సొంత వాహనాలు కలిగి ఉండటం, తృణధాన్యాలు కానటువంటి ఆహారం తదితర అంశాలు సంపన్న కుటుంబాలు ఎక్కువ ఉద్గారాలను విడుదల చేయడానికి కారకాలని ఈ అధ్యయనం తేల్చింది.

ఒకవైపు ఆధునిక సాంకేతికత, సేవలతో అభివృద్ధి చెందుతున్న సమాజానికి.. మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, సామాజిక బహిష్కరణ, వనరుల క్షీణతల మధ్య కొట్టుమిట్టాడుతున్న సమాజానికి దారితీసే గణనీయమైన ఆర్థిక వృద్ధికి మధ్య వైరుధ్యం మన సమాజంలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. వివిధ సామాజిక సమూహాల మధ్య జీవన శైలి భావనలు కూడా విభిన్నంగా పుట్టుకొస్తున్నాయి. అంటే, వాతావరణ మార్పుల పట్ల అవగాహన, అవసరమైన చర్యలు కూడా భిన్నంగా ఉంటాయి. ఈ వాస్తవాన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి.

ప్రస్తుతం మన తెలంగాణలోని 33 జిల్లాల్లో 29 జిల్లాలు వరద ప్రభావిత జిల్లాలుగా గుర్తించారు. 1 డిగ్రీ గ్లోబల్ వార్మింగ్ కారణంగానే ఈ విపరీత పరిణామాలు జరుగుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల సంభవించే వేడిగాలులు, అధిక ఉష్ణోగ్రతలు మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా అతిభారీ వర్షాలు, వరదలు, తుఫానులకు కారణమవుతున్నది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల జీవితాలు అతలాకుతలమవడంతో పాటు జీవనోపాధి, ఆస్తులకు నష్టం జరుగుతున్నది. ఎలాంటి మౌలిక వసతులకు నోచుకోకుండా లోతట్టు ప్రాంతాల్లో నివసించే పేదలు వీటివల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నారు.

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల 29 మంది చనిపోయినట్టు తెలంగాణ ప్రభుత్వం నివేదించింది. అంతేకాదు, రూ.5,400 కోట్ల విలువైన ఆస్తుల నష్టం కూడా జరిగినట్టు వెల్లడించింది. ప్రైవేట్, సామాజిక ఆస్తులకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేసింది. కానీ, వాటిని ఇందులో చేర్చలేదు.

ముఖ్యంగా శిలాజ ఇంధనాల వినియోగం వల్ల వాతావరణ మార్పులు జరుగుతున్నాయి. ఈ వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రమాదాల దృష్ట్యా శక్తి వినియోగంలో ప్రాథమిక మార్పు అత్యవసరం. ఇది తక్కువ ఉద్గార సమాజానికి దారితీస్తుంది.

శక్తి, ఆహార ఉత్పత్తి, మొబిలిటీ, గృహ ఇంధన వినియోగం తదితర అంశాల్లో భారీ మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నది. సహేతుకమైన పరిష్కారం కోసం సాంకేతిక చర్యలు, విధానపరమైన సాధనాలు కచ్చితంగా అవసరం. నిబంధనలు, నియమాలు, చర్యలు, సర్దుబాట్లు అనేవి రాజకీయ, పరిపాలనా వ్యవస్థల్లోనే కాదు, సమాజంలో, కుటుంబాల్లో కూడా ఏకకాలంలో జరగాలి.

మరో మాటలో చెప్పాలంటే.. ఈ సవాళ్లను ఎదుర్కొని స్థిరత్వం వైపు పయనించేందుకు మనకు కావలసింది విధానాలు, సాంకేతికత, జీవనశైలి, పౌర సమాజంతో పాటు వ్యవస్థలో మార్పు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమవుతున్న సంపన్న కుటుంబాల జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చి ఉద్గారాలను తగ్గించవచ్చు. అదే సమయంలో, సమాజంలోని పేద, అణగారినవర్గాలను ఆదుకోవడం ద్వారా వాతావరణ మార్పుల పర్యవసానాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. అయితే వీటిని చేపట్టేటప్పుడు యావత్ సమాజాన్ని కలుపుకొని వెళ్లాలి. సంపన్నులతో పోలిస్తే తమ ప్రమేయం తక్కువగా ఉన్నప్పటికీ గ్లోబల్ వార్మింగ్ సామాన్యులను ఎక్కువగా బాధిస్తున్నది. అందువల్ల ఈ చర్యల పర్యవసానాలు భిన్నంగా ఉంటాయి.

ఏదేమైనప్పటికీ, ఈ వ్యూహాలు సమాజంలోని వివిధ వర్గాలకు ఆకర్షణీయమైన మంచి జీవితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా చేపడితే మాత్రం అవి చాలావరకు విఫలమవుతాయి. అయితే దీనికి ప్రజల నుంచి రాజకీయ మద్దతు లేకపోవడం మరో ప్రతికూలాంశం. బహుశా మన ముందున్న అతిపెద్ద సవాలు ఇదే!

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమవుతున్న సంపన్న కుటుంబాల జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చి ఉద్గారాలను తగ్గించవచ్చు. అదే సమయంలో, సమాజంలోని పేద, అణగారిన వర్గాలను ఆదుకోవడం ద్వారా వాతావరణ మార్పుల పర్యవసానాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. అయితే వీటిని చేపట్టేటప్పుడు యావత్ సమాజాన్ని కలుపుకొని వెళ్లాలి.

(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే, వ్యవసాయ, వాతావరణ నిపుణుడు)

అరువై ఏండ్ల ప్రజా ఆకాంక్షలకు, వందలాది మంది యువకుల ఆత్మ బలిదానాలకు ప్రతిఫలమే తెలంగాణ. దశాబ్ద కాలానికి పైగా అలుపెరుగని పోరాటం చేసి, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊపిరి సలపకుండా రాజకీయంగా ఉద్యమం చేసిన కేసీఆర్ తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారు. ఇది ఎవ్వరూ కాదనలేని చారిత్రక సత్యం.

మాయమైన తెలంగాణ సోయి

డాక్టర్
కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్ర సహకారం కొరవడటం, రాష్ట్రంలో విద్యుత్తు కొరత, సాగు, తాగునీటి సమస్య, క్రాప్ హాలిడేలు, ఏపీ-తెలంగాణ పంపకాలు.. ఇలా ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి. అయినప్పటికీ పదేండ్లలోనే అనేక సవాళ్లను ఎదుర్కొని వ్యూహాత్మకంగా, ప్రాధాన్యక్రమంలో సమస్యలకు శాశ్వ త పరిష్కారం చూపుతూ పునర్నిర్మాణం దిశగా సాగుతూ తెలంగాణను అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి పథంలో నడిపించా రు. కేంద్ర గణాంకాల సాక్షిగా సంక్షేమంలో, అభివృద్ధిలో దేశానికే స్ఫూర్తినిచ్చేలా ముందుకు సాగించారు. తలసరి ఆదాయ వృద్ధిలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలవడమే అందుకు నిదర్శనం.

కానీ, దురదృష్టం కొద్దీ ప్రజాపాలన పేరిట రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 9 నెలల్లోనే తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని 20 ఏండ్లు వెనక్కినెట్టింది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎదుర్కొన్న కడగండ్లను మళ్లోసారి తెలంగాణ ప్రజల కండ్లముందు ఉంచింది. తెలంగాణకు వెన్నెముక లాంటి హైదరాబాద్‌ను గత పదేండ్లలో విశ్వనగరంగా అభివృద్ధి చేసుకున్నాం. అనేక సం స్కరణలను తీసుకొచ్చాం. కరోనా కాలాన్ని సైతం లెక్కజేయకుండా కోట్ల రూపాయల పెట్టుబడులు వరదలా వచ్చిపడ్డాయి. అనేక అంతర్జాతీయ సంస్థలు తమ వ్యాపార విస్తరణ కోసం హైదరాబాద్‌ను 2వ గమ్యస్థానం గా ఎంచుకున్నాయి.

కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్త పెట్టుబడుల మాట పక్కనపెడితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్థలు కూడా పక్క రాష్ట్రాలకు పారిపోతున్నాయి. కేన్స్ టెక్నాలజీ సంస్థ ఇప్పటికే గుజరాత్‌కు వెళ్లిపోయింది. కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించింది. అమర రాజా కంపెనీ తరలిపోయేందుకు సిద్ధమవుతున్నది. ఈ పరిస్థితి పోవాలంటే పెట్టుబడుల విషయంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం తమ వైఖరి ఏమిటో విధానపరంగా తెలియజేయాలి. లేకపోతే కనీసం గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కొనసాగించాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ ప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకొని తీసుకునే నిర్ణయాల వల్ల రాష్ట్ర పురోగతి కుంటుపడుతుంది.

గత పదేండ్లలో అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడ్డ తెలంగాణ ఇప్పుడు పక్క రాష్ట్రంతో పోటీపడుతామని చెప్పే దుస్థితి ఏర్పడింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే తెలంగాణ ఇప్పుడు కనీసం టాప్ 10లో కూడా చోటు సంపాదించుకోలేకపోతున్నది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ అప్పుల కుప్పయిందని చెప్తుండటం హేయనీయం. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. గత ప్రభుత్వం సాధించిన ప్రగతిని తొక్కిపెట్టి రాష్ట్రం దివాళా తీసిందని దివాళాకోరు రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు? ఇది రాష్ట్ర ప్రజలనే కాదు, రాష్ట్ర పురోగమనాన్ని కూడా తప్పుదోవ పట్టించడమే.

రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహాలక్ష్మి అమలు వంటి అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వం మీద నిందలు వేస్తున్నది. బట్టకాల్చి మీద వేసే ఇలాంటి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మానుకోవాలి. ప్రజల దృష్టిని మరల్చే ఇలాంటి పనులకు బదులు ఒక సంస్థనైనా తీసుకురావాలి.

అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు, పాలకులు చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా ఉండిపోతాయి. ప్రజలు కాంగ్రెస్‌కు పాలనాపగ్గాలు అప్పగించింది గత పాలకుల స్మృతులను చెరిపివేయడం కోసం కాదు, వీలైతే తెలంగాణ ప్రజల కోసం మరిన్ని మంచి పనులు చేయమని. కక్షసాధింపు రాజకీయాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇలాంటి రాజకీయాలకు స్వస్తిపలికి గత పదేండ్ల తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని కొనసాగించండి. తెలంగాణ ప్రజలకు ఒక భరోసాను కల్పించండి. మీ నుంచి తెలంగాణ సమాజం ఆశిస్తున్నది ఇదే. ఇంతకుమించి ఇంకేం కాదు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)